3. కథలు

## చిలుక, కాకి కథ

శ్రీమతి దరిశి అన్నపూర్ణమ్మగారు

అడవిలో ఒక రాగిచెట్టుండేది. ఆకుకనబడకుండా రాగిపండ్లుండేవి. గుంపులుగుంపులుగా చిలుకలు కాకులువచ్చి రాగిపండ్లుతినేవి. అందులో ఒకకాకి, ఒకచిలుక పండ్లకొఱకు తగువువేసెను. చిలుక కాకిని జూచి "కాకి కన్నులొట్టపోని''అన్నది. కాకికన్నులొట్టపోయింది. కాకికి కోపంవచ్చింది. "చిలుకమూతి సొట్టపోని"అన్నది కాకి. చిలుకమూతి సొట్టపోయింది. రాజుగారి ఏనుగ రాగిఆకులు తినడానికివెళ్లి "కాకీ! నీకన్నులొట్టపోయిందే"మన్నది. "నేనేమని జెప్పేది? కాకికన్నులొట్టపోయింది, చిలుకమూతి సొట్టపోయింది, ఏనుగతొండం వెనుకకుపోనీ" అన్నదికాకి. అలాగే ఏనుగతొండం వెనక్కుపోయింది. ఏనుగ ఏటికివెళ్లి తోకకు అతుక్కొనిపోయిన తొండంతోనీరుత్రాగింది. ఏరు ఏనుగతో "తొండంవెనకుపోయిందే"మన్నది. ఏనుగ"నేనేమనిచెప్పేది, కాకికన్ను లొట్టపోయింది, చిలుకమూతి సొట్టపోయింది, ఏనుగతొండం వెనక్కుపోయింది; ఏటిలో నీరెండిపోనీ''అన్నది. ఏటిలో నీరెండిపోయింది. అత్తా, కోడలు మడినీరు తెచ్చుటకు ఏటికివెళ్లిరి. నీరులేనందున "ఏరా! ఏరా! నీరెందుకులేదన్నారు". ఏరు "నేనేమనిచెప్పేది, కాకి కన్నులొట్టపోయింది, చిలుకమూతి సొట్టపోయింది, ఏనుగతొండం వెనక్కుపోయింది, ఏటిలోనీరెండిపోయింది, అత్తా కోడల తలలకు బిందెలంటుకుపోనీ'' అన్నది. దానిమాటప్రకారమే బిందెలంటుకొనిపోయినవి. ఇద్దరు యింటికివెళ్లేసరికి మామగారు జపముచేయడానికి జపమాలతోకూర్చొన్నారు. మామగారు కోడలను జూచి "నీళ్లెందుకులేవే"దన్నారు. "నేనేమనిజెప్పేది, కాకికన్ను లొట్టపోయింది, చిలుకమూతి సొట్టపోయింది,; ఏనుగతొండం వెనక్కుపోయింది, ఏటిలో నీరెండిపోయింది, అత్తా కోడల తలలకు బిందెలంటుకొన్నవి, మామగారిచేతికి జపమాలంటుకొపోనీ"యని కోడలనేసరికి జపమాల శెట్టిగారిచేతికి అంటుకొనిపోయింది. శెట్టి జపమాలతోగూడ కోర్టుకువెళ్లెను. జడ్జీ శెట్టినిజూచి "కోర్టుకు జపమాలతెచ్చినావెందుకు?" అన్నాడు. శెట్టి "నేనేమనిజెప్పేది, కాకికన్ను లొట్టపోయింది, చిలుకమూతి సొట్టపోయింది, ఏనుగతొండం వెనక్కుపోయింది, ఏటిలో నీరెండిపోయింది, అత్తా కోడలకు బిందెలంటుకొన్నవి, శెట్టిచేతికి జపమాలంటుకొన్నది, జడ్జీగారికి, వకీళ్లకు కుర్చీలంటుకొపోని"అన్నాడు. అందరికి కుర్చీలంటుకొన్నవి. కుర్చీలు ఏలాగువదిలించడం తెలియక అందరుచేరి గట్టిగ బొబ్బలు పెట్టేరు. బొబ్బలువిని ఊళ్లోవాండ్లంతా భయపడి కోర్టుచుట్టుగుమిగూడిరి. వారిలో ఒకగోపాయి జడ్జీనిజూచి జరిగినకథ చెప్పమన్నాడు. జడ్జీ "నేనేమనిచెప్పేది, కాకికన్ను లొట్టపోయింది, చిలుకమూతి సొట్టపోయింది, ఏనుగతొండం వెనక్కుపోయింది, ఏటిలో నీరెండిపోయింది, అత్తాకోడలకు బిందెలంటుకొన్నవి, శెట్టిగారిచేతికి జపమాలంటుకొన్నది, జడ్జీకి వకీళ్లకు కుర్చీలంటుకొన్నవి, గోపాయినోటిలో గంజాఅని చెప్పబోవుచుండగ హాచ్చుమ్మని తుమ్మెను. తుమ్ముతో శాపం తీరిపోయింది. జడ్జీకి, వకీళ్లకు అంటుకొన్న కుర్చీలు ఊడిపోయెను, శెట్టిగారి జపమాలవిడిపోయింది, అత్తాకోడల తలలకు అంటుకొన్న బిందెలు సడలెను, ఏరు క్రొత్తనీటితో నిండిపోయింది, ఏనుగతొండం యథాప్రకారం వచ్చింది, కాని చిలుకమూతి సొట్ట, కాకికన్ను లొట్ట శాశ్వతంగానున్నవి.

## ఇత్తడిఅత్తగారు

శ్రీమతి కొప్పర్తి సీతాబాయిగారు

అనగనగా ఒకబ్రాహ్మడి కిద్దరుకొడుకులు. ఇద్దరికీ పెళ్లిళ్లయి కోడళ్లువచ్చేరు. అత్తగారికి చిన్నకోడలంటే చాలాయిష్టం, పెద్దకోడల్ని సాదించిపోయడం. కొన్నాళ్లకి